సాక్షి చిత్తూరు

శనివారం । 19 । జూలై । 2025



సీపీఎస్ రద్దు చేసేవరకు..

సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం ఆగదని ఉపాధ్యాయ సంఘాల నేతలు హెచ్చరించారు.

- 8లో



పీఎఫ్ చెల్లింపులు వేగవంతం

పీఎఫ్ చెల్లింపులు వేగవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు డిమాండ్ చేశారు.

- 8లో



ఒంటరి ఏనుగు బీభత్సం

తవణంపల్లి మండలం, మాధవరం గ్రామ పరిసరాల్లో ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టిస్తోంది.

- 8లో

అయ్యో కట్టమంచి!

చిత్తూరు జిల్లా కేంద్రంలోని కట్టమంచి చెరువు బావురుమంటోంది. నాలుగు నెలలుగా టీడీపీ నేతలు చెరువుని కుళ్లబొడుస్తున్నారు. అందులోని మట్టిని రాత్రిపగలు తేడాలేకుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మొరవ వరకే మట్టి ఎత్తాలనే నిబంధన ఉన్నా పట్టించుకోకుండా చెలరేగిపోతున్నారు. యథేచ్ఛగా జేసీబీలతో తవ్వి తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. మట్టి తవ్వకాలపై ఓ ఇరిగేషన్ అధికారి ప్రశ్నించినందుకు అతన్ని డమ్మీ చేశారనే ప్రచారం జోరుగా సాగుతోంది.. ఈ మట్టి దందాపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..

కుళ్లబొడుస్తున్న టీడీపీ నేతలు

- నాలుగు నెలలుగా నిర్విరామంగా అక్రమ తవ్వకాలు
- రోజూ టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలింపు
- రైతుల ముసుగులో ఇటుక బట్టీలు, వెంచర్లకు విక్రయాలు
- మొరవ వరకే మట్టి ఎత్తాలనే నిబంధన ఉన్నా పట్టించుకోని నేతలు
- అక్రమ తవ్వకాలపై మాట్లాడినందుకు ఇరిగేషన్ అధికారిని డమ్మీని చేసిన వైనం



కట్టమంచి చెరువులో జేబీసీలతో మట్టి తోడేస్తున్న దృశ్యం

చిత్తూరు టాస్క్‌ఫోర్స్: చిత్తూరులో నిత్యం లక్షల మంది ప్రయాణించే ఆర్టీసీ బస్టాండ్ ఆనుకుని కట్టమంచి చెరువు ఉంది. ఈ చెరువులో నాలుగు నెలల నుంచి రాత్రి పగలు తేడాలేకుండా మట్టిదోపిడీ సాగుతోంది. కళ్లెదుటే కనిపిస్తున్నా ఉన్నతాధికారులెవ్వరూ నోరు మెదలేకపోతున్నారు. టీడీపీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో సాగుతున్న ఈ మట్టిమాఫియాపై స్థానికులు గ్రీన్‌ట్రిబ్యునల్‌కి ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. వ్యవసాయ భూములకు మట్టి అవసరమైతే రైతు రూపాయి చెల్లించి తీసుకెళ్లే వెసులుబాటు ఉంది. ఆ రైతు కూడా పాసుపుస్తకాలతో సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. ఆపైనే మట్టి తీసుకెళ్లేందుకు అనుమతి ఇస్తారు. మట్టి తీసుకోవాలన్నా మొరవ వరకే తవ్వుకోవాల్సి ఉంటుంది. మొరవకు మించి చెరువులో మట్టిని తవ్వడానికి నిబంధనలు ఒప్పుకోవు.

అమ్మకాలు ఇలా..

కట్టమంచి చెరువులోని మట్టిని జేసీబీలతో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. చిత్తూరు, పూతలపట్టు పరిధిలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇటుక బట్టీల వారికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మరో వైపు నగరంలోని కూటమి నేతలు కూడా వారికి తెలిసిన వారికి మట్టిని విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. టిప్పర్ మట్టి రూ.4వేల నుంచి రూ.5వేలు, ట్రాక్టర్ మట్టి రూ.వెయ్యి చొప్పున విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మార్చి 23న ప్రారంభమైన తవ్వకాలు నిరాటంకంగా సాగుతున్నాయి. అక్రమ తవ్వకాలపై ఎవరైనా మాట్లాడితే టీడీపీ నేత ఎదురుతిరిగి బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిసింది. ఇరిగేషన్‌లోని ఓ అధికారి మట్టి తవ్వకాలపై వేరొకరితో చర్చించినందుకు అతని అధికారాలకు కోత పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. కట్టమంచి చెరువులో మట్టి తవ్వకాలపై అధికారులెవ్వరూ నోరెత్తకుండా టీడీపీ నేత చర్యలు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. కట్టమంచి చెరువులో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

చిత్తూరుకి పొంచి ఉన్న ప్రమాదం

రైతుల ముసుగులో ఓ వైపు, కట్టమంచి చెరువు సుందరీకరణ పేరుతో మరో వైపు టీడీపీ నేతలు కట్టమంచి చెరువుకు తూట్లు పొడుస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కట్టమంచి చెరువులో ప్రస్తుతం నీరు లేవు కాబట్టి ఇష్టమొచ్చినట్టు తవ్వకాలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు మించి చెరువులో మట్టి కోసం అట్టడుగు లోతుకు తవ్వి తరలిస్తున్నారు. వర్షాలు కురిస్తే చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని ఇరిగేషన్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు వస్తే ఏం జరుగుతుందోనని కట్టమంచి చెరువు చుట్టుపక్కల నివాసం ఉంటున్న జనం బిక్కుబిక్కు మంటున్నారు.



లారీల్లో తరలుతున్న మట్టి



మట్టి తవ్వకాల కారణంగా ఏర్పడిన గుంతలు



మట్టి తవ్వకానికి సిద్ధంగా యంత్రాలు

న్యూస్‌రీల్

గజ బాధితులకు పరిహారం

సాక్షి ఎఫెక్ట్..

యాదమరి: యాదమరి మండలంలో గజ బాధిత రైతులకు మొదటి విడతగా రూ.1.45 లక్షలు పంపిణీ చేశారు. ఈనెల 5న 'పరిహారానికి గ్రహణం' శీర్షికన సాక్షిలో వార్త వెలువడింది. దీనిపై స్పందించిన కూటమి ప్రభుత్వం గురవారం స్థానిక ఎమ్మెల్యే కె.మురళీమోహన్ చేతుల మీదుగా యాదమరి, బంగారుపాళ్యం మండలాల్లోని దాదాపు 20 మంది రైతులకు పరిహారాన్ని అందజేశారు. రెండో విడత పరిహారాన్ని మరో వారం రోజుల్లో అందజేస్తామని అటవీశాఖాధికారులు తెలిపారు.

టీకాలు వేయించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వ్యాధి నిరోధక టీకాలను పిల్లలకు వంద శాతం వేయించాలని డీఐఓ హనుమంతరావు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆయన శుక్రవారం ఆశా నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భిణుల నమోదు విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. వారికి వైద్య సేవలందించే విషయంలో అలసత్వం వద్దన్నారు. శిశుమరణాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు అనిల్‌కుమార్, జయరాముడు, శ్రీవాణి, మూర్తి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

డీపీఈ ఈఈగా హరి



చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో డీపీఈ(విద్యుత్ చౌర్య నివారణ) విభాగం ఈఈగా హరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈఈగా ఉన్న షణ్ముగం ఇటీవల పదవీ విరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో ఆదోని డివిజన్ ఈఈగా ఉన్న హరి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు డీఈ, ఏఈలు పరిచయం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. గతంలో డీపీఈ డీఈ, రూరల్స్ డివిజన్ ఈఈగా పని చేసిన విషయం గుర్తుచేసుకున్నారు.

అడవుల్లో సోలార్ లైట్ రిఫ్లెక్టర్స్



సోలార్ లైట్ రిఫ్లెక్టర్స్

చిత్తూరు కార్పొరేషన్: అడవుల్లో సోలార్ లైట్ రిఫ్లెక్టర్స్ ఏర్పాటు చేయనున్నట్లు ఈస్ట్ ఎఫ్ఆర్వో థామస్ తెలిపారు. రూ.12,500 విలువచేసే 10 లైట్స్‌ను రాష్ట్ర అటవీశాఖ పంపిణీ చేసిందన్నారు. వీటిని పొలాల సమీపంలో, ఏనుగులు, అడవి జంతువులు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కల్లూరు, దేవళంపేట, కోటపల్లె, జూపల్లె, సైజలగుంట, కమ్మపల్లె ప్రాంతాల్లో పెట్టనున్నట్టు వెల్లడించారు. స్తంభాలు ఏర్పాటు చేసి అందులో లైట్స్‌ను పెడతామన్నారు. అందులో నుంచి తేనెటీగల శబ్దంతో పాటు తెల్లటి రంగులో వెలుతురు వస్తుందన్నారు. వెలుతురు జంతువుల కళ్లలో పడడంతో అటువైపుగా అవి రావన్నారు. లైట్స్ ఆఫ్ అండ్ ఆన్, రొటేషన్ పద్ధతిలో వాడుకోవచ్చని వివరించారు.

స్టోర్స్‌కి అగ్నిమాపక పరికరాలు



స్టోర్‌లో అగ్నిమాపక పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో స్టోర్స్‌కు శుక్రవారం అగ్నిమాపక పరికరాలు వచ్చాయి. మొత్తం 14 పరికరాలు ఇక్కడికి చేరుకున్నట్లు ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. ఏదైన అగ్ని ప్రమాదం, షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు మంటలార్పడానికి ఇవి ఉపయోగపడుతాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మంటలను అదుపు చేయడానికి వీటిని వినియోగించనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు 24 వచ్చినట్లు పేర్కొన్నారు. వాటితో పాటు 56 కిలోమీటర్ల కేబుల్స్ కూడా వచ్చాయన్నారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నా..కనికరించరా?

- కల్లుగీత లైసెన్సు కోసం కలెక్టర్‌కు వినతి
- కలెక్టర్ చెప్పినా లైసెన్సు ఇవ్వకుండా తిప్పలు
- ఆర్నెళ్లుగా అబ్కారీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు



ఎక్సైజ్ ఈఎస్ కార్యాలయం వద్ద లింగేశన్ పడిగాపులు

చిత్తూరు అర్బన్: ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు లింగేశన్. చిత్తూరు మండలం, తాళంబేడుకు చెందిన కల్లుగీత కార్మికుడు. ఉదయాన్నే చెట్టు ఎక్కి కల్లుగీస్తే తప్ప పూట గడవదు. కుల వృత్తిని నమ్ముకున్న లింగేశన్ వద్ద ఉన్న కల్లుగీత లైసెన్సు గడువు తీరిపోయింది. ఆర్నెళ్ల క్రితం కలెక్టర్ వద్దకు వెళ్లి, తన లైసెన్సు రెన్యూవల్ చేయాలని, వీలుకాని పక్షంలో కొత్త లైసెన్సు మంజూరు చేయాలని వేడుకున్నాడు. కలెక్టర్ కూడా పెద్ద మనసుతో వెంటనే కల్లుగీత లైసెన్సు మంజూరు చేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. అప్పటి నుంచి వారంలో రెండు మార్లు చిత్తూరులోని ఎక్సైజ్ ఈఎస్ కార్యాలయం వద్దకు రావడం, తన లైసెన్సు గురించి అధికారులను అడగం. 'సారు వీడియో కాన్ఫరెన్స్‌లో ఉన్నారు. మళ్లీ రావయ్య..!' అని ఒకరు, 'సారు మీటింగులో ఉన్నారు, రేపు రా..' అంటూ మరొకరు. తీరా ఆ సారును కలిస్తే ఫైలు ఎక్కడుందో చూసి చెబుతానంటూ సమాధానం. ఇలా ఆరు నెలలుగా లింగేశన్‌కు ఎక్సైజ్ అధికారులు నరకం చూపిస్తున్నారు. మళ్లీ కలెక్టర్ వద్దకు వెళితే తనపై పగబట్టి, లైసెన్సు ఇవ్వకుండా చేస్తారేమోనని.. లింగేశన్ ఆర్నెళ్లుగా ఎక్సైజ్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నాడు. అసలు కలెక్టర్ సంతకం చేసి ఇచ్చిన అర్జీ అధికారుల వద్ద ఉందో, లేదో కూడా తెలియడం లేదు. లేదనే విషయం చెబితే పరువుపోతుందనుకున్నారో ఏమోగానీ.. వారంలో రెండు సార్లు లింగేశన్‌ను కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. పోనీ అధికారులకు 'దక్షిణ' ఏదైనా ఇద్దామంటే.. తన పరిస్థితి అంతంత మాత్రమేనంటూ లింగేశన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఎక్సైజ్ అధికారుల రాతి గుండె కరగడానికి పాపం ఈ వ్యక్తి ఇంకెన్నాళ్లు కార్యాలయం చుట్టూ తిరగాలో చూడాలి మరి.

సర్వే తీరు పరిశీలన



కాలనీ వాసుల సమస్యలను తెలుసుకుంటున్న జేసీ

యాదమరి: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సర్వేను అధికారులు పగడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. శుక్రవారం ఆమె సమగ్ర సర్వే ప్రక్రియలో భాగంగా మండల పరిధిలోని కీనాటంపల్లి పంచాయతీ షికారీ కాలనీలో పర్యటించారు.

సిబ్బంది చేపడుతున్న సర్వే తీరును పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో గృహ యజమానులతో మాట్లాడారు. ఒకే ఇంట్లోనే ఉంటూ వేర్వేరుగా వంట చేసుకునే వారికి సపరేట్‌గానే సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బోరు మోటారు ఏర్పాటు చేయండి మేడమ్

షికారీ కాలనీ ప్రజలు తమ కష్టాన్ని జేసీకి విన్నవించారు. వ్యవసాయం చేసుకోవాలన్నా అందుకు అవసరమైన నీటి వనరులు లేకపోవడంతో ప్రభుత్వం తమకిచ్చిన భూములు నిరుపయోగంగా ఉన్నాయని ఆవేదన చెందారు. తమకు ప్రభుత్వం నుంచి వ్యవసాయ బోరును ఏర్పాటు చేయాలని కోరారు. కొత్తగా పెళ్లైన వారు ఉన్నారని వారికోసం కొత్త రేషన్ కార్డులు, ఇళ్లను మంజూరు చేయించాలని విన్నవించారు. అసంపూర్తిగా ఉన్న పాత ఇళ్లను పూర్తి చేసుకోవడానికి అవసరమైన రుణాలను మంజూరు చేయించాలని ఆమెను కోరారు. స్థానిక తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీఓ వేణు పాల్గొన్నారు.

నేరుగా అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి సమీపంలోని మురకంబట్టు వద్ద ఉన్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్లు చేసుకుంటారని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి చిన్నారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా అడ్మిషన్లు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. జిల్లాలో అర్హత, ఆసక్తి ఉన్న ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, పార్శికులు, బౌద్ధులు, జైనులు అడ్మిషన్లు పొందాలన్నారు. 5 నుంచి 8వ తరగతి వరకు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. 5వ తరగతిలో 61, ఆరో తరగతిలో 50, ఏడో తరగతిలో 42, 8వ తరగతిలో 41 సీట్లు ఖాళీలున్నాయన్నారు. అడ్మిషన్లు పొందే విద్యార్థులకు విద్యతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం, కాస్మొటిక్ చార్జీలు, వైద్య సౌకర్యం, పాఠ్యపుస్తకాలు అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 8712625058 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమష్టి కృషి వల్లే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంక్



కార్మికులను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్ : నగరపాలక అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల సమష్టి కృషితోనే స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 ఉత్తమ ర్యాంక్ సాధ్యమైందని మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరపాలక కార్యాలయంలో అధికారులు, పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు, కార్మికులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం కార్మికులను ఆత్మీయంగా సత్కరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రక్రియకు చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, సహాయ కమిషనర్ ప్రసాద్, ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎంఈ వెంకటరామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఇన్‌చార్జ్ మేనేజర్ గోపాలకృష్ణవర్మ, ఎంహెచ్‌వో లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు లైన్ క్లియర్

– ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 2025-26 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లకు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయ్యింది. డిగ్రీ అడ్మిషన్లు చేపట్టడంతో కూటమి ప్రభుత్వం ఈ ఏడాది తీవ్ర ఆలస్యం చేసింది. విద్యార్థులు ఇంటర్మీడియెట్ పూర్తి చేసినప్పటికీ మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. కొంతమందేమో ఇంజినీరింగ్ వైపు వెళ్లిపోగా...డిగ్రీ చదవాలని ఎంచుకున్న విద్యార్థులు మాత్రం నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏప్రిల్‌లో ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదల చేయగా మూడు నెలల తర్వాత డిగ్రీ అడ్మిషన్లకు అవకాశం కల్పించారు. డిగ్రీ అడ్మిషన్ దరఖాస్తు ప్రక్రియలో ఎస్సీ రిజర్వేషన్ అమలులో ప్రభుత్వం మార్పులు చేసింది. ఈ మేరకు అడ్మిషన్ల ప్రక్రియకు అనుసరించాల్సిన విధి విధానాలను రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్ట్స్, సైన్స్, సోషల్, కామర్స్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్, సోషల్ వర్క్ సబ్జెక్టుల్లో బీఏ, బీఎస్సీ, బీకాం అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో అడ్మిషన్లకు అనుమతి మంజూరు చేసింది.

ఆన్‌లైన్ మొరాయింపు

డిగ్రీ అడ్మిషన్‌లకు మొదటి నుంచే ఆన్‌లైన్ మొరాయిస్తోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లో సైతం దరఖాస్తులు చేసుకునేందుకు అనుమతిచ్చారు. అయితే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించే కళాశాలల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తే ప్రిన్సిపల్స్ తప్పనిసరిగా రసీదు ఇవ్వాలి. విద్యార్థి ఏ కళాశాలలో అయితే దరఖాస్తు చేస్తారో ఆ కళాశాలను, అక్కడి కోర్సులను ప్రథమ ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేసే విద్యార్థులు దరఖాస్తుతో పాటు అడ్మిషన్లు పొందే కళాశాలల్లో కోర్సులను వరుస క్రమంలో పేర్కొనాలి.

మెరిట్ కమ్ రోస్టర్ విధానం అమలు

డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లకు మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని అమలు చేయనున్నారు. రిజర్వుడ్ కేటగిరీ విద్యార్థులకు వారి రిజర్వేషన్ ప్రకారం అడ్మిషన్ సీట్లు కేటాయిస్తారు. ఎస్సీ విద్యార్థులకు మొత్తం సీట్లల్లో 15 శాతం కేటాయిస్తారు. ఈ రిజర్వేషన్‌లను వర్గీకరణ ప్రకారం అమలు చేస్తారు. గ్రూపు-1లోని 12 కులాలకు 1 శాతం, గ్రూపు-2లోని 18 కులాలకు 6.5 శాతం, గ్రూపు-3 లోని 29 కులాలకు 7.5 శాతం చొప్పున 15 శాతం సీట్లు కేటాయించేలా చర్యలు చేపడుతున్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయం 10.30 నుంచి 12 గంటల వరకు సంప్రదాయ రీతిలో అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసపు చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, పూలతో ముస్తాబు చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాస దీక్షలతో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఉభయదారులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదాలు అందజేశారు.



ఆలయంలో భక్తుల రద్దీ

క్లుప్తంగా

మొగిలి దేవరకొండలో చిరుత



రోడ్డు పక్కన సంచరిస్తున్న చిరుత

బంగారుపాళెం: మండలంలోని మొగిలి దేవర కొండలో చిరుతలు సంచరిస్తున్నాయి. శుక్ర వారం తమిళనాడుకు చెందిన భక్తులు కారులో పార్వతీ సమేత శ్రీజలకంఠేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు దేవరకొండకు వెళ్తుండగా గోశాల సమీపంలో ఓ చిరుత రోడ్డు పకన కనిపించినట్లు తెలిపారు. దేవరకొండ చుట్టూ కౌండిన్య అభయారణ్యం ఆవరించి ఉండడం వల్ల చిరుతలు, ఏనుగులు సంచరిస్తున్నట్లు పశువుల కాపరులు, గ్రామస్తులు తెలిపారు. గతంలో దేవరకొండ సమీపంలో చిరుతలు మేకలు, పశువులపై దాడి చేసి చంపేసినట్లు పేర్కొన్నారు. చిరుతల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సారా కేసుల్లో తొమ్మిది మంది బైండోవర్

కుప్పం: మండల పరిధిలోని దేవరాజుపురం, ఆరిమానుపెంట గ్రామాల్లో గతంలో సారాయి కేసుల్లో నిందితులుగా ఉన్నా తొమ్మిది మందిని బైండోవర్ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ నాగరాజు తెలిపారు. తమిళనాడు సరిహద్దులోని తిమ్మంబట్టు, వాణియంబడి పోలీసు స్టేషన్లలో వీరిపై సారాయి కేసులు నమోదైనట్లు తెలిపారు. దేవరాజుపురం గ్రామానికి చెందిన ఏలుమలై, తంగం, ముత్తు, రామలింగం, అమ్ములు, తిరుమలై, మోహన్, కార్తీక్, చిరంజీవిని కుప్పం తహసీల్దార్ చిట్టిబాబు సమక్షంలో హాజరు పరిచినట్టు వెల్లడించారు. ఆపై రూ.లక్ష చొప్పున పూచీకత్తుపై బైండోవర్ చేసినట్టు తెలిపారు.

ఒంటరి ఏనుగు బీభత్సం



మామిడి చెట్టు కొమ్మలు విరిచిన ఒంటరి ఏనుగు



ఏనుగు పాదాల గుర్తులు

తవణంపల్లె: ఒంటరి ఏనుగు పొలాల్లో బీభత్సం సృష్టించింది. మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న మాధవరం సమీపంలోని అడవిలో నుంచి వచ్చి రచ్చరచ్చ చేసింది. గుంపులో నుంచి తప్పిపోయిన ఒంటరి ఏనుగు చాలా కాలంగా సంచరిస్తోంది. ఈ ఏనుగు గురువారం రాత్రి మాధవరానికి చెందిన మనోహర్‌రెడ్డి మామిడి తోటలోకి ప్రవేశించి అల్లకల్లోలం సృష్టించింది. భారీగా మామిడి కొమ్మలు విరిచివేసింది. కొమ్మల్లో సుమారు అర టన్నుకు పైగా నీలం రకం కాయలను తొక్కి నాశనం చేసింది. ఈ దాడిలో సుమారు రూ.20 వేల వరకు నష్టపోయినట్టు బాధిత రైతు వాపోయాడు.

సీపీఎస్ రద్దు చేసేవరకు పోరాడుతాం

- ఆగస్టు నుంచి పోరాటం ఉధృతం
- కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి
- సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి
- కలెక్టరేట్ ఎదుట డీఎస్సీ 2003 టీచర్ల ఫోరమ్ ధర్నా



ప్లకార్డులు చేతబట్టి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు, సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : సీపీఎస్ రద్దు చేసేవరకు పోరాడుతామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ.రమణ స్పష్టం చేశారు. ఈ మేరకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలంటూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట 2003 డీఎస్సీ టీచర్ల ఫోరమ్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ఆపస్, ఎస్టీయూ, టీఎన్‌యూఎస్ తదితర సంఘాలు మద్దతునిచ్చాయి. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ అమలు తేదీ కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్‌లో ఉద్యోగాలకు ఎంపికై ఇతర కారణాలతో ఆలస్యంగా ఉద్యోగాల్లో చేరి సీపీఎస్ పరిధిలోకి వచ్చిన టీచర్లకు న్యాయం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీలో సీపీఎస్ అమలు తేదీ 01-09-2004 కంటే ముందే ఉద్యోగానికి ఎంపికై అప్పటి ప్రభుత్వ కాలపరిమితి ముగిసి నూతన ప్రభుత్వ ఏర్పాటు వల్ల ఉద్యోగాల్లో చేరడం ఆలస్యమైందన్నారు. ఈ సమస్య వల్ల రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 11 వేల మంది టీచర్లు, ఉద్యోగులు సంబంధం లేని, నోటిఫికేషన్‌లో పేర్కొనని సీపీఎస్ విధానంలోకి బలవంతంగా నెట్టబడ్డారని ఆరోపించారు. న్యాయం జరగకపోతే ఆగస్టు నుంచి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మమ్మల్ని ఓపీఎస్ పరిధిలోకి తీసుకోండి

ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటా మోహన్ మాట్లాడుతూ 2003 డీఎస్సీ బాధితులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తప్పనిసరిగా నెరవేర్చాలన్నారు. అనంతరం ఆ సంఘ నాయకులు డీఆర్వో మోహన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరమ్ కన్వీనర్లు మోహన్, ఢిల్లీ ప్రకాష్, వెంకటేష్, మధు, శ్రీధర్, కోదండరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, నాగరాజురెడ్డి, కిరణ్‌కుమార్, మునాఫ్ పాల్గొన్నారు.

ఉత్తర్వులు అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం 2003 డీఎస్సీ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి. సీపీఎస్ పరిధిలోకి వచ్చేలా కేంద్రం జారీచేసిన మెమో 57ను కచ్చితంగా అమలు చేయాలి. ఈ విషయంలో అలసత్వం వహించడం అన్యాయం. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం.

– బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు

అభద్రతా భావానికి లోను చేస్తోంది



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి. 2003 డీఎస్సీ టీచర్లు మొదటి నుంచి అవస్థలు ఎదుర్కొంటూనే ఉన్నారు. రాష్ట్రంలో అత్యున్నత కేడర్‌లో ఉండే అధికారులకు ఒక న్యాయం.. దిగువ స్థాయిలో ఉండే ఉద్యోగ, ఉపాధ్యాయ, పోలీసులకు మరో న్యాయం చేయడం వల్ల తీవ్ర అభద్రతా భావానికి లోనవుతున్నారు. కూటమి ప్రభుత్వం కచ్చితంగా న్యాయం చేయాలి. – మోహన్ యాదవ్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

మెమో 57 అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం వెంటనే మెమో 57ను అమలు చేయాలి. గోవా, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్, హర్యాణా, చత్తీస్‌ఘడ్, ఢిల్లీ, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, ఒడిశా, అస్సాం తదితర రాష్ట్రాల్లో మెమో 57ను అమలు చేస్తున్నారు. ఏపీలో మాత్రం ఆ మెమోను ఎందుకు అమలు చేయడం లేదో తెలియడం లేదు. పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– మణిగండన్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

బాధ్యులను చేశారు



ఎలాంటి తప్పు లేకున్నా డీఎస్సీ 2003 టీచర్లను సీపీఎస్ పరిధిలోకి తీసుకొచ్చి బాధ్యులను చేయడం ఎంత వరకు కరెక్టు. సీపీఎస్ అమలు చేసిన తేదీ 01-09-2004 కంటే ముందే ఉద్యోగానికి ఎంపికైన టీచర్లను సీపీఎస్ పరిధిలోకి ఎలా తీసుకొస్తారు. అప్పటి ప్రభుత్వం కాలపరిమితి ముగియడం మేము చేసిన తప్పా. నష్టపోయిన 2003 టీచర్లకు న్యాయం చేయాల్సిందే.

– రాజేశ్వరి, ఆపస్ సంఘ నాయకురాలు

పీఎఫ్ చెల్లింపులు వేగవంతం చేయండి



సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్ : భవిష్యనిధి రుణాలు (పీఎఫ్), తుది మొత్తాల చెల్లింపులు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని ఎస్టీయూ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్, జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు శుక్రవారం జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడుని కలిసి వినతి పత్రం అందజేశారు. సీఈవోతో వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చెందిన టీచర్లకు తుది మొత్తాలు చెల్లించడం ఆలస్యమవుతోందని, ఈ జాప్యం వల్ల ఉద్యోగ విరమణ పొందిన టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. దీనిపై జెడ్పీ సీఈవో స్పందిస్తూ రాష్ట్రంలో మిగిలిన జిల్లాల కంటే చిత్తూరు జిల్లాలో భవిష్యనిధి ఖాతాల నిర్వహణ మెరుగ్గా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోడె మోహన్‌యాదవ్, నాయకులు లింగమూర్తి, చంద్రన్, నరేంద్ర పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు నుంచి పడి వృద్ధుడి మృతి

గుడుపల్లె: కుప్పం నుంచి కేజీఎఫ్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులో నుంచి ఓ వృద్ధుడు పడి శుక్రవారం మృతి చెందాడు. గుడుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం.. కుప్పం నుంచి కేజీఎఫ్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులో బండకొత్తూరు గ్రామానికి చెందిన మునెప్ప(73) స్వగ్రామానికి వెళ్లడానికి బస్సు ఎక్కాడు. మార్గమధ్యంలోని బండకొత్తూరు స్టాప్ వద్ద డ్రైవర్ బస్సును ఆపకుండా కొంచెం దూరం వెళ్లాడు. ఆపై ఎదురుగా వస్తున్న ఆటోను సైడ్ తీశాడు. ఇంతలో మునెప్ప తన స్వగ్రామం వచ్చేసిందని కిందకు దిగే క్రమంలో బస్సు కదిలింది. మునెప్ప బస్సు నుంచి జారి పడి మృతి చెందాడు. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నమ్మకానికి ప్రతీక భారతి అల్ట్రా ఫాస్ట్



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా పత్రాలను అందజేస్తున్న భారతి సిమెంట్ టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి

గుడిపాల: నమ్మకానికి, దృఢత్వానికి ప్రతీకగా భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ నిలుస్తుందని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ సి.ఛాయాపతి తెలిపారు. శుక్రవారం గుడిపాల మండలంలోని నరహరిపేట సమీపంలో కృష్ణా ట్రేడర్స్ రవి ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి మాట్లాడుతూ జర్మనీ టెక్నాలజీ, రోబోటెక్ క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ నిపుణుల పర్యవేక్షణలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు వెల్లడించారు. టెంపర్ ప్రూఫ్ బస్తాలతో మార్కెట్‌లోకి వస్తుండడంతో తూకం తగ్గే అవకాశం కూడా ఉండదన్నారు. సిమెంట్ రంగంలో భారతి సిమెంట్ అగ్రగామిగా నిలిచిందన్నారు. అనంతరం భారతి సిమెంట్‌కు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలు, విశిష్టత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ తయారవుతున్న విధానం, భవన నిర్మాణ కార్మికులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలను అందజేశారు.

రేపు ఐఐటీ 7వ స్నాతకోత్సవం

ఏర్పేడు : 'వారంతా ఏళ్ల తరబడి జాతీయ విద్యా సంస్థ ఐఐటీ ఒడిలో సాంకేతిక విద్యను అభ్యసించారు. తమ భావి జీవితానికి గట్టి పునాదిని ఇక్కడే నిర్మించుకున్నారు. అత్యుత్తమ మార్కులతో తాము ఎంచుకున్న కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి జరగబోయే 'పట్టా'భిషేక వేడుకలో డిగ్రీ పట్టాలను అందుకోనున్నారు. ఈ వేడుక 418 భావి ఇంజినీర్లలో కొత్త కాంతులను తీసుకురానుంది. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ (భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ) ప్రాంగణంలో ఆదివారం 7వ స్నాతకోత్సవ వేడుక జరగనుంది.

వేడుక వివరాలు

వేడుకలో పట్టాలు పొందనున్న విద్యార్థులు 418, అవార్డులు అందుకోన్న విద్యార్థులు 18, ప్రెసిడెంట్ మెడల్ విజేత– అరవింద్ శ్రీనివాసన్ (సీఎస్‌ఈ), గవర్నర్ మెడల్ విజేత – ఎం.మేఘవర్షిణి (కెమికల్ ఇంజినీరింగ్)

ఆ నగదు చెల్లించండి



ఏడీ–2కి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో పాల్గొన్న టీచర్లకు రెమ్యునరేషన్ నగదు చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు డీఈవో కార్యాలయంలో ఏడీ 2 వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు పూర్తయ్యి మూడు నెలలు అవుతోందన్నారు. ఇంతవరకు పేపర్లు దిద్దిన టీచర్లకు నగదు ఇవ్వకపోవడం దారుణమన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు లేవన్నారు. జిల్లాలో బదిలీలకు ముందు ఇచ్చిన ఉద్యోగోన్నతుల్లో సోషల్, గణితం, బయాలజీ సబ్జెక్టులకు సంబంధించి ఉద్యోగోన్నతుల పోస్టులు మిగిలిపోయాయన్నారు. వెంటనే మిగిలిన పోస్టులను ఉద్యోగోన్నతి ప్రక్రియలో భర్తీ చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌యాదవ్ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమల్లో వివిధ ప్రాథమిక పాఠశాలలకు నేరుగా సరఫరా చేయకుండా క్లస్టర్ కేంద్రాల్లో బియ్యం, రాగిపిండి డంప్ చేస్తున్నారన్నారు. ఇలా చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలలకు క్లస్టర్ కేంద్రాల నుంచి వాటిని తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్, సంఘ నాయకులు లింగమూర్తి యాదవ్, నరేంద్ర పాల్గొన్నారు.

టీడీపీ నేత ఇంట్లో భారీ చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రభాకర్, బీరువాలను తెరిచి ఉంచిన దృశ్యం, ఘటనా స్థలంలో డాక్‌స్క్వాడ్ తనిఖీలు

పలమనేరు: పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్వీ బాలాజీ ఇంట్లో భారీ చోరీ చోటుచేసుకున్న విషయం శుక్రవారం వెలుగుచూసింది. వివరాలు.. పట్టణంలోని పెంకుల కిట్టన్న మిషన్ సమీపంలో నివాసముంటున్న ఆర్వీ బాలాజీ కుటుంబం వారం రోజుల క్రితం బయటికెళ్లింది. దీన్ని గమనించిన దొంగలు పక్కా ప్రణాళికతో ఇంటిపైనున్న కిటికీని తొలగించి లోనికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలను ముందుగా తొలగించారు. ఆపై బీరువాలను ధ్వంసం చేసి సుమారు కిలో బంగారు ఆభరణాలు, రూ.4 లక్షల నగదును చోరీ చేసి తీసుకెళ్లారు. కాగా గురువారం రాత్రి ఇంటికొచ్చిన ఆర్వీ బాలాజీ కుటుంబీకులు గ్రౌండ్‌ఫ్లోర్‌లో నిద్రించారు. శుక్రవారం ఉదయం పై అంతస్తులోని ఇంటిని శుభ్రం చేసేందుకు వచ్చిన పని మనిషి బీరువాలు తెరిచి ఉండడం, కిటికీ ఊచలు విరిగిపోయి ఉండడాన్ని గుర్తించి యజమానికి తెలిపింది. దీంతో ఇంట్లో చోరీ జరిగినట్టు బాధితుడు గుర్తించారు. దీనిపై స్థానిక పోలీసులకు సమాచారాన్ని అందించారు. డీఎస్పీ డేరంగుల ప్రభాకర్, సీఐ నరసింహరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి విచారణ చేస్తున్నారు.

ఈ ఘటనలో ఎంత బంగారు చోరీ అయిందనే విషయం ఇంకా నిర్ధారించలేదు. ఆర్థిక స్థితిగతులు తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉంటారనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్టు సమాచారం.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి

– స్నేహితుడే హతమార్చాడని బంధువుల ఆరోపణ



మృతిచెందిన గర్భిణి ఇంద్రజ(ఫైల్)

కుప్పం: ఏడు నెలల గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గెరిగెణేపల్లి పంచాయతీ, డీ.ఆర్ అగ్రహారం గ్రామంలో చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన సతీష్ గర్భిణీపై లైంగిక దాడి చేసి హతమార్చాడని మృతురాలు బంధువులు శుక్రవారం కుప్పం పోలీసు స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మృతురాలి బంధువుల కథనం.. గెరిగణేపల్లి గ్రామానికి చెందిన ఇంద్రజ(30)కు వరుసకు మేనమామ అయిన పెరుమాల్‌తో వివాహమైంది. వీరికి ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు. పెరుమాల్ కూలి పనుల కోసం అరేబియన్ దేశం కత్తర్‌కు వెళ్లేవాడు. రెండేళ్లకోసారి స్వగ్రామానికి వచ్చేవాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన సతీష్ ఇంద్రజతో స్నేహంగా ఉండేవాడు. ఏమైందో ఏమోగానీ గురువారం ఉదయం ఇంద్రజ డీఆర్ అగ్రహారం గ్రామంలోని సొంత ఇంట్లో ఉరి వేసుకుని తనువు చాలించింది. ఈమె మృతిపై కత్తర్‌లో ఉన్న భర్త పెరుమాల్‌కు సమాచారం అందింది. అతను వచ్చి భార్య మృతిని తట్టుకోలేక బోరున విలపించాడు. సతీష్ అనే వ్యక్తి తన భార్యను వేధించి లైంగికదాడి చేసి చంపేశాడని మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడు సతీష్‌ను కఠినంగా శిక్షించాలని పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ,ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు కోరారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ రవికుమార్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం మాట్లాడుతూ జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలల పరిధిలో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పీఎఫ్ వార్షిక స్లిప్స్‌ను వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలని చెప్పారు. పీఎఫ్ సమస్యల పరిష్కారానికి వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలన్నారు. అంతర్ జిల్లా నుంచి వచ్చిన ఉపాధ్యాయుల పీఎఫ్ కు సంబంధించిన ట్రాన్స్‌ఫర్, అకౌంట్ బదిలీ సమస్యలను తొలగించాలన్నారు. కారుణ్య నియామకలను నెలవారీగా సమీక్షించి ఎప్పటికప్పుడు పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వాలన్నారు. పీఎఫ్ రుణాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆలస్యం కాకుండా మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మురళి, జిల్లా ఉపాధ్యక్షులు రామ్మూర్తి, సుబ్రహ్మణ్యం, మహేష్, షణ్ముగం, అరుణ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు దేవరాజులు, కుమార్, చలపతి పాల్గొన్నారు.

13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, నిందితులు

పులిచెర్ల(కల్లూరు): వాహనం సహా 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్టు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తెలిపారు. వారి కథనం మేరకు.. ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ముందుగా సమాచారం అందడంతో కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలను తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఏపీ03–ఎస్3713 నంబరు గల మారుతీ సుజికీలో 13 ఎర్రచదనం దుంగలు, ఏడుగురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించారు. ఆపై నిందితులను అదుపులోకి తీసుకుని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులు తమిళనాడు రాష్ట్రం, కళవకుచ్చి జిల్లా, కళువరాయ్‌మలైకి చెందిన ఏలుమలై, సెంథిల్, అన్బలగన్, రామన్, అన్నాదొరై, కుప్పస్వామి, మణిగా గుర్తించారు. ఎర్రచందనం దుంగలతోపాటు వాహనం విలువ రూ.20 లక్షలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్, ఎఫ్ఆర్ఓ ఎస్.చంద్రశేఖర్, ఎఫ్‌బీఓ ప్రకాష్‌కుమార్, ఎఫ్‌బీఓ కే.ప్రతాప్, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం భర్తపై దాడి

– తల్లిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన కుమార్తెలు



గాయపడిన జయవేల్

కార్వేటినగరం: కాటికిపోయే వయసులో కక్షలు పెంచుకున్నారు. ఆస్తుల కోసం కత్తులతో దాడుల దాకా దిగజారిపోయారు. ఈ ఘటన కార్వేటినగరం మండల పరిధిలో శుక్రవారం కలకలం రేపింది. స్థానికుల కథనం.. మండలంలోని కొల్లాగుంట గ్రామానికి చెందిన జయవేల్(70), రాజేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పిల్లలకు వివాహాలయ్యాయి. వాళ్లు ఒక్కోచోట స్థిరపడిపోయారు. కుమారుడి భార్య గతంలోనే విడిపోయి ప్రస్తుతం వేరుగా ఉంటోంది. ఈ క్రమంలో తండ్రి జయవేల్ కుమారుడికి సపోర్ట్ చేస్తూ రాగా.. తల్లి రాజేశ్వరి కోడలికి మద్దతు పలుకుతూ వస్తోంది. జయవేల్ తమ సొంత గ్రామం కొత్తపల్లిమిట్టలో ఉన్న ఆస్తిని అమ్మి కొల్లాగుంటలో ఆస్తి కొనుగోలుచేసి భార్య పేరుతో సొంత ఇంటి నిర్మాణం చేసుకుని స్థిరపడ్డారు. ఆ ఇంట్లో నుంచి భర్త జయవేల్‌ను తరిమేయాలని భార్య రాజేశ్వరి స్కెచ్ వేసింది. ఈ క్రమంలోనే గత ఐదేళ్లుగా భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి. జయవేల్‌ను చంపేస్తామంటూ భార్య బెదిరింపులకు దిగడంతో ఆయన టీవల పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ వివాదంపై కోర్టులో కేసు కూడా నడుస్తోంది. గురువారం భార్యాభర్తలిద్దరూ కోర్టుకు హాజరై వచ్చారు. అయినప్పటికీ తీరుమార్చుకోని భార్య రాజేశ్వరి గురువారం రాత్రి ఆయనతో తీవ్రంగా గొడవపడింది. ఆపై శుక్రవారం తమ బంధువులతో కలసి జయవేల్‌ను కత్తితో నరికి హత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గుర్తించి అతన్ని 108 వాహనం ద్వారా కార్వేటినగరం సీహెచ్‌సీకి తరలించారు. ఆపై మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. తండ్రిపై దాడి జరిగినట్లు సమాచారం అందుకున్న కుమార్తెలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నల్లమందు ఉండలు తిని కుక్క మృతి



మృతిచెందిన కుక్క

గుడిపాల: నల్లమందు ఉండలు తిని ఓ కుక్క మృతి చెందింది. వివరాలు.. మండలంలోని పశుమంద ఎస్టీ కాలనీ సమీపంలో గల చెరువు వద్ద అడవి పందుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం సాయంత్రం నల్లమందు బాంబులను పెట్టారు. ఇంతలో అక్కడికి వెళ్లిన ఓ కుక్క దాన్ని పట్టుకొని కొరకడంతో ఒక్కసారిగా పేలింది. ఆపై తల పగిలి అక్కడికక్కడే మృతిచెందింది.